


అప్పుడే భోజనమయింది. అవ్వాళ చెయ్యవలసిన పనులను నెమరుకు తెచ్చుకుంటూ యీజీచైర్‌లో మేనువాల్చి అంతూదరీలేని ఆలోచనల్లో మునిగాను. ఎప్పుడు వచ్చినిల్చుందో బాల యెదురుగా నిల్చున్నది. నేను పరధ్యానంతో వూహాసౌధాలు నిర్మిస్తున్నాను.

'ఇవాళ టపావచ్చిందండీ?'

అంటూ సాగదీసింది. ఆమె ముహంలోనికి నేరుగా చూస్తూ—

'టపాగొడవ నీకేం కావల్సివచ్చిందంట!'

'మావాళ్ళవద్దనుంచి యేమయినా కబురు కాకరకాయ వచ్చుంటుందేమోనని.'

'ఆహా! వచ్చింది. లెటరు రాశారు మామగారు.'

ఆవిడగారు నమ్మలేదు. నిజానికి రాలేదు కూడాను. ఒకవేళ వచ్చియున్నప్పటికి ప్రత్యక్షంగా చూస్తేగాని నమ్మేరకంకాదది.

'అమావాశ్య వెళ్ళింతర్వాత మంచిరోజు చూసి నిన్నుతీసుకురమ్మన్నారు. మరి యేమంటావ్?'

ఎప్పుడు చూసినా ఇట్టాంటి వొట్టొట్టె మాటలేనా?' అన్నది. దీర్ఘంగా బుగ్గలు సొట్టపడేట్టు.

'నిజం. కాని నిన్ను పంపటానికి నాకిష్టం లేదు. లేదనటానికి చాలా కారణాలువున్నై. మొట్టమొదటిది నువ్వు నాతో కాపురం ప్రారంభించి సంవత్సరం అయినప్పటికి వంటచెయ్యటంలోని యే వొక్క విషయమూ నాకు నేర్పలేదుగదా! మరి యెట్లాచావను? హోటలుమెతుకులు మనకి సుతలామూ సరిపడవ్. తర్వాత రాత్రిసమయం నువ్వు జ్ఞాపకంవస్తే నాపాట్లు యేదారిపడతయ్యో నువ్వూహించగలవా? ఎందుకు నవ్వుతావ్! అంచాతను, మరేవిటంటే మీ అమ్మాయి రానంటోంది, నా అభ్యంతరం యేంలేదూ? మీరువొచ్చి యిష్టపడతే తీసుకెళ్ళవచ్చూ, అని జవాబు రాసిపారేస్తాను.'

ఫక్కున నవ్వింది. అంటే నన్నో ఫూల్ కింద జమచేసిందన్నమాట. ఇంతలో వీధితలుపులు రెండూ బోర్లాతెరుచుకున్నై. సిగరెట్టుదమ్ము పీల్చుకుంటూ నారాయణరావు లోనికివచ్చాడు. బాల లోనికి తప్పుకుంది. నేరుగావచ్చి పక్కనేవున్న మరొక సింహాసనం ఆక్రమించాడు. ఇష్టాగోష్ఠిలోనికి దిగాం.

'ఇంటిదగ్గర వుండవనుకున్నాను.'

'ఇవాళ ఆదివారం అన్నవిషయం జ్ఞప్తియందు వున్నదా?'

'వర్తకులకు ఆదివారం యేమిటి? లాభాలు అధికంగా వస్తుంటే అమావాశ్యలుకూడా దుకాణం తెరుస్తారు?'

'ఆ గొడవకేంగాని, అర్జంటు యేంలేదుగదా? రాధ యేంచేస్తున్నాడు?'

'వాడిగురించి మాట్లాడడానికే నేనిప్పుడు వచ్చింది. రాధ చెడిపోతున్నాడు.'

'చెడిపోతున్నాడా? అదేమిటోయ్ కొత్త సంగతి మాట్లాడుతున్నావ్?'

'కొత్తయేంలేదు. వ్యవహారం పాతబడింది.'

'యేంవిటి కథ?'

'మధ్యను అనవసరంగా నేను చిక్కులో పడతానేమోనని భావిస్తున్నాను. రేపొద్దుట యెటు వచ్చి యెటుజరిగినా నింద నా నెత్తినపడుతుంది.'

'ఒరేయ్ నారాయణా! చంపక సంగతేంటో మూడుముక్కల్లో తేల్చు, నేను బోధపడక చాల బాధపడుతున్నాను.'

'తొందరపడక విను. వాడు యీమధ్య రాత్రులు పరుంటానికి గదికిరావటంలేదు. వచ్చినా పదిదాటకుండా యేదోమిష పెట్టి వెళ్ళిపోతున్నాడు.'

'కుఱ్రతనం సినిమాలకి గట్రా తిరుగొస్తుం టాడు. ఇందులో అంత ఆలోచించాల్సింది యేమ్నుంది?'

'నీ వూహాలు సరియైనవికావులే. సినిమాలకి పోతే అర్థరాత్రికయినా యిల్లు చేరుకోవాలికదూ? అసలు రావటంలేదు. తెల్లవారినాక యే యెనిమిది తొమ్మిదికో వస్తున్నాడు.'

'బాగావుంది. అయితే యిది ఆలోచించాల్సిందే. నువ్వు అడగలేదూ మరి!'

'సరిగా జవాబు యివ్వడుగా.'

'కొంచెం సీరియస్‌గా అడగలేకపోయావ్?'

'ఇవాళ అట్లా అడిగే వెధవనయ్యాను.'

'వాట్ వాట్! యేంజరిగింది?'

'వాడంటాడు, 'నేను తొంభైచోట్లకి వెడ తాను, అవన్నీ అడగటానికి నీ వెవడవ్? నేను ముండయింటికి వెడుతున్నాను. అడిగేందుకు నువ్వెవరవ్?' అంటూ నన్ను దూసుకుపోయాడు.'

రుమిళ్ళ విశ్వనాథరావు

'నేను గోళ్లుకొరుక్కుంటూ ఆలోచనలో పడ్డాను. కిటికీ ఊచల్లోంచి తొంగిమాస్తూ మా సంభాషణ వింటోంది బాల. నిజంగా రాధ అట్లా మారాడా అని నా సందేహం. అతను పాడయినాడంటే ఆపాక్ నారాయణకొక్కడికేకాదు, నాకూ తగుల్తుంది. ఈ విషయంలో యిదమిద్ధమని నేనూహించలేకపోయాను.

'అయితే నారాయణా నిజమేనంటావా?'

'నూటికి నూరువంతులు నిజం. వాడినోటితో వాడు పబ్లిగ్గా చెబుతున్నాడు. మూడు రాత్రులు సి. ఐ. డి. గా నేను శ్రమపడి టెస్టుచేసాను. అంతెందుకూ నేను నీకు ప్రత్యక్షంగా చూపుతాగా.'

అంటూ వాడులేచాడు. ఏదో తొందరపని జ్ఞాపకంవచ్చినవాడిలా. తర్వాత కలుస్తానని గుడ్ బై చెప్పి వెళ్ళిపోయాడు. బంగారంలాంటి కుఱ్రవాడు అనవసరంగా చెడిపోతున్నాడేమిరా దేముడా అనుకుంటూ దీర్ఘంగా యోచిస్తున్నాను. వాణ్ణి బాగు చెయ్యాలి. ఎట్లా? చెడిపొయ్యేవాణ్ణి బాగుచెయ్యటం మనతరమా? ఆలోచిస్తున్నాను.

'రాధ అంటే, ఎఱ్ఱగా సన్నగా వుంటే అబ్బాయికదూ?' అన్నది దగ్గరకువస్తూ బాల.

'ఔను. వాడే మా వూరువాడు. మాకు కావలసినవాడు. అయితే ఆదివారంపూట వచ్చిన మిత్రుడికి కాస్త కాఫీఅయినా యిచ్చావ్ కావే.'

'ఆయన కాస్సేపయినా కూర్చోకుండా పరిగెడితే యెట్లా?'

అంటూ తప్పుకుంది మా ఆవిడ.

౨

నేను, నారాయణరావు, రాధ ఒక్కవూరు వాళ్లం. రాధ మాకంటె జూనియర్. అన్ని విషయాల్లోనూ కూడ. మాకంటె రెండుమూడు తరగతులు క్రింద వుండే వాడు. వయస్సులోకూడ డిఫరెన్సు వుంది. నేను స్కూల్ ఫయినలుతో చదువుకు స్వస్తిచేప్పి వ్యాపారంలో ప్రవేశించి పట్నంచేరాను. నారాయణ బి.ఎ. పూర్తిచేసాడు. ఆంధ్ర సిమెంట్ ఫ్యాక్టరీలో వుద్యోగం సంపాయించి అతనూ పట్నం చేరాడు. మంచిచెడ్డలు చూడటానికి మేమిరువురం టౌన్‌లో వున్నామనే వుద్దేశంతో రాధను చదువుకోసమని వాళ్లతండ్రి మా యిరువురపయిన భారం వైచి పట్నంచేర్చి కాలేజీలో ప్రవేశపెట్టాడు. రాధ నారాయణ లాడ్జిలో వుంటూ చదువుకుంటూ బాగానే వుంటున్నాడు. నారాయణకు కూడా పెళ్ళికాలేదు. ఎటొచ్చీ ఆ కాస్తకార్యమూ ఆలశ్య మెందుకని కానిచ్చినవాణ్ణి నేనే. మేం ముగ్గురం ముగ్గురంగా వొకరు వర్తకం చేసుకుంటూ, మరొకారు చదువుకుంటూ, ఇంకొకరు వుద్యోగం చేసుకుంటూ వొకేవూళ్లో నివాసమేర్పర్చుకోవటం ఆనం

దాయకమైన విషయమని తలపోసేవాణ్ని. ఇల్ల వుండగా యీనాటికి మాలో వొకడు మమ్మల్ని త్రోసిరాజన్నాడు. అదే నాకు గొప్పవిచారం.

ప్రతి ఆదివారం యేదో సినిమాకు వెళ్లే అలవాటు నాకుంది. ఆనాడు లీలామహల్‌లో గొప్ప హాలీవుడ్ పిక్చరు ప్రదర్శింపబడివుంది. మర్చంట్సు అసోసియేషన్ మీటింగుకు సాయంకాలం హాజరయి అక్కణ్నించి నేరుగా సినిమాకి వెళ్ళాను. థియేటర్‌లో నారాయణ కలిశాడు, ఏవో సంగతులు భవిష్యత్ గురించి మాట్లాడుకుంటూ కూర్చున్నాం. నారాయణ నా భుజంతడుతూ—

'వొరేయ్! అడుగో రాధ'

అంటూ రెండుమూడు వరుసలకు ముందు కూర్చున్న రాధను చూపాడు. చూసాను.

'ఇట్లాపిలు, మాట్లాడుదాం' అన్నాను.

'ఇప్పుడుకాదు. నేను చెబుతాను తొందరపడకు' ఆట ప్రారంభమయింది. దృష్టి తెరపైన వున్నా ఆలోచన్లు రాధపయినే వున్నై. వాడిని గురించి యేమిటిచెయ్యటం అనేది ఒకసమస్య అయిపోయింది. ఇంకో పదిహేనునిమిషాల్లో ఆట ముగించబడుతుందనగా నారాయణలేచి నన్నుకూడా లేవగొట్టాడు. బయటికి లాక్కొచ్చాడు. తీసుకెడుతున్నాడు యెక్కడికో? వాడిచర్య నాకు అర్థంకావటంలేదు. నారాయణ కేమయినా మతిగాని పోలేదుగదా అని నాకు భయంపుట్టింది. ఊరుకోలేకపొయ్యాను.

'ఎక్కడికిరా తీసుకెడుతున్నావ్?'

'చుప్ రహో!'

ఆఖరికి వీడికి నిజంగా మతిపోయుంటుందన్న నిశ్చయం వస్తున్నది నెమ్మదినెమ్మదిగా. సుమారు రెండుమైళ్ళు నడిపించాడు. ఆకాశమంతా చిన్న చిన్న మేఘాలతో అలంకరించబడింది. ఒక యింటి ముందు పొన్నచెట్టుక్రిందకు తీసుకెళ్ళి ఆగాడు. టూ రెండుసిగరెట్లుతీసి నాకు ఒకటి ప్రసాదించి తనొకటి ముట్టించాడు. ఇద్దరంకూడ నిశ్శబ్దంగానే వున్నాం. రోడ్డునపోతున్న రిక్షాలచప్పుడు, బళ్ళచప్పుడు తప్ప మరేశబ్దమూలేదు. రాత్రి పదకొండు గంటలవేళ యిక్కడ నిల్చున్న మమ్మల్ని యెవరయినాచూస్తే యేమనుకుంటారు? దొంగతనానికో లేక...తనానికో కాని వున్నట్లు భావించి పట్టుకుంటారేమోనని నాభయం. ఇంతలో ఒక రిక్షావచ్చి మాకుదగ్గరగా అదేయింటిదగ్గర ఆగింది. మేము చెట్టుచాటుకు తొలగినాం. ఒక యువకుడు, ఒక యువతి రిక్షాలోంచి దిగారు. నారాయణ నన్ను హెచ్చరిస్తూ 'గుర్తుపట్టావా?' అన్నాడు.

'ఆహా! రాధ.'

వాళ్ళు యింటోదూరి తలుపేసుకున్నారు.

'అయితే నారాయణరావ్! ఇందుకేనా యింతదూరం తీసుకొచ్చింది?'

'అవును నీకు ప్రత్యక్షంగా చూపుదామని. రా పోదాం.'

రోడ్డుయెక్కి వాళ్ళనుతీసుకొచ్చిన రిక్షాపైన మేమిద్దరం అధిరోహించాం. కుర్రవాడు రోమాన్సులోపడ్డాడు. వాడి భవిష్యత్ పరిణామం యేరంగుల్లో వుంటుందో వూహిస్తే నాకు వాడిపైన జాలికలిగింది. అల్పసౌఖ్యాలకు ఆశించి ముందు జీవితాన్ని నాశనంచేసుకుంటున్నాడు. అదే నా పెద్ద విచారం. మా గృహసామీప్యాన్ని నేను దిగిపోయాను. నారాయణరావు రిక్షాలో వెళ్ళిపోయాడు. అర్థరాత్రి యిల్లు చేరినందుకు అర్ధాంగి అలుక అయిదు నిమిషములు మనపై ప్రళయబాంబువలె పనిచేసింది.

3

ఆ మరునాటి సంగతే యిది. ఏ మరునాటి సంగతంటే ఆరాత్రి వానికథ ప్రత్యక్షంగా చూసిన మరునాడు, ఆనాడంతా వాడికోసం పనిమానేశాను.

(తరువాయి 21 వ పేజీలో)

(10వ పేజీ తరువాయి)

మాయింటికి తీసుకొచ్చాను. కొన్ని నిమిషాలు గడిచింతర్వాత :

'రాధా ! నిన్ను కొన్నిసంగతులు అడగదలచాను, నువు సరియయిన జవాబులు యివ్వాలి.'

సుర్రవాడు వంచినతల యెత్తుతూ కొంచెం సావకాశంగా, నావంక చూశాడు. ఆ చూపులు కొంచెం దురుసుతనాన్ని వ్యక్తపరుస్తున్నై. 'యవ్వనపుపొంగులు, యుక్తవయసులో పెళ్ళిచెయ్యకపోతే శారీరకంగా మానవవృక్షం యేవిధంగా వక్రిస్తుందో రాధలో నేను కొంచెం చూడగలిగాను. ఈ పరుగులు వివాహితుల్లోకూడ వస్తుంటవే అనిగాని ప్రశ్నిస్తే అది వేరేసంగతి. అపుడు వచ్చే కష్టనష్టాలకు యెవరూ బాధ్యులుకారు. వాడికివాడే బాధ్యుడు. వాడు ప్రశ్నించాడు:

'ఏమిటది ?' అంటే నేను అడగబోయే విషయమన్నమాట.

'ఏమిటా ? నీప్రస్తుత ప్రవర్తన. అది యెంతమాత్రం బాగుండలేదు. అదేమిటో నీకు తెలుసా ?'

'నాప్రవర్తన నాకు తెలీకుండా యెట్లా వుంటుంది ?'

'సరే దారిలోకివచ్చావ్ ! మేము నీ అభ్యుదయం కోరేవాళ్ళమంటే ఒప్పుకుంటావా ?'

'తప్పకుండా.'

'అయితే మా మాటకు విలువవుంచుతావా ?'

'అది నాయిష్టం.'

'నీ సంగతంతా తెలిసింది. నేను ప్రత్యక్షంగా చూశాను. రేపు నీ తండ్రికి తెలిస్తే చాలదూరం పోతుంది. బాధ్యత మీదపెట్టుకున్న మేము తల వంచుకోవాలి.'

వాడు జవాబివ్వకుండా తలవంచుకున్నాడు. మనమాట వింటున్నాడుగదా అని నాకు ఆనందం కల్గింది.

'రేప్రొద్దుట నీకేమయినా వస్తే యిక్కడ చూసేదెవరు ? ఇటువంటివేషాలు యిక కట్టిపెట్టాలి తెలుసా ! ఛీ ! ఏంపనాపాడుపని ? ఏమేనా తగుల్తే ఆ జిడ్డ నీతోవగుల్తుందా ? ఆలోచించు !'

'చాలు. నా మంచిచెడ్డల్ని నేను నిర్ణయించుకోగలను. నాకు అవుసరమయినది, నేను చేస్తున్నాను. అదితప్పో ఒప్పో వేరేసంగతి.'

'అయితే విరమించవన్నమాట'

'ఆమాట వేరేచెప్పాలా !'

నాకు ఒళ్ళుమండిపోయింది. ఏంసమాధానం?

'విరమించవ్ ! ఛీ !! యీరోజుతో నీకూ మాకూ సరి ! నీముఖం చూడకూడదు.'

వాడు లేచాడు మొహంకొంచెం యెర్రబడింది.

'ఈసారి స్నేహధర్మంగ వూరుకున్నా, మరోసారి అంటే చాలదూరం పోతుంది.

'అయితే నారాయణరావు గది నీవు యిక వెళ్ళనవుసరంలేదు. ఈ పాడునింద వాడికూడా యెందుకు ?'

ఫక్కున నవ్వాడు. నేను నిర్ఘాంతపోయాను. నాకు రాధపై చాల కోపంవచ్చింది. చేస్తున్న వెధవ పనికి నవ్వుకూడాను.

'అయితే, నారాయణరావే నా వ్యవహారం అంతా బోధపర్చాడన్నమాట. అడ్డువదుల్చుకోటానికి నారాయణ మంచియేత్తుయెత్తాడు. ఇప్పుడెందుకు సమయంరానీ నారాయణ సంగతి నేనూ చూస్తాను. తర్వాత కలుద్దాం.'

మరి మాట్లాడకుండా వెళ్ళిపోయాడు. ఆచివరి మాటల్ని బట్టిచూస్తే మరికొన్ని కొత్తసంగతులు తెలిసేటట్టువున్నై. ఇదంతా కుంభకోణంగా

కన్పిస్తోంది. వాడు వెళ్ళిపోయిన అరగంటవరకూ ఆలోచించినా యేంబోధపడలేదు. ఆ కుర్చీలో అట్లానే ఆలోచిస్తూ నిద్రపోయ్యాను.

౪

కొన్నిరోజులు గతించినై. రాధతో జోక్యం తగ్గిపోయింది. ఏ దారిలోనయినా తారసపడినా మాట్లాడటంలేదు. నారాయణకూడా వాణ్ణి తనగదికి రానివ్వటంలేదు. మేమిద్దరం కలిసి వాళ్ల ఫాదరికి చేటభారతమంత వుత్తరంరాశాం. మా బాధ్యతను నిర్వర్తించుకుంటున్నట్టు.

ఒకరోజు తెల్లవారుజామున సుమారు 4 గంటలు అయివుంటుంది. నేను నిద్దరనుండిలేవలేదు, నా భార్య ఆ టయిముకులేచి యింటిపన్లు చూసుకుంటుంది. ఎప్పుడూలేనిది, బలవంతాన నన్ను లేవగొట్టింది. మాంచినిద్దర చెడగొట్టిందేఅని కసురుకుని మళ్లా దుప్పటి ముసుగుతున్నాను.

'చూడండీ మీకోసరం యెవరో వచ్చారు, వీధిలోవున్నారు అంది.'

ఎవరబ్బా అనుకుంటూ కళ్లు నులుపుకుంటూ బయటికివెళ్లాను. రాధ. నాకాశ్చర్యం కలిగింది.

'ఏరా యిట్లావచ్చావ్ ?'

'నువ్వోకసారి వెంటనే నాకూడారావాలి. ఇప్పుడు నన్ను మరేంఅడక్కు.'

వాడివెంట బయలుదేరాను. సందుగొందులు త్రిప్పి తీసుకెడుతున్నాడు. ఎంతవరకూ తీసుకెళ్లాడంటే, ఆనాటిరాత్రి యే యింటిలోనికయితే ఒక స్త్రీతో కలిసివచ్చి రాధ ప్రవేశించాడో సరిగ్గా అదే యింటిముందుకు తీసుకువచ్చాడు. రోడ్డుమీదేదో ప్రకగా నిల్చున్నాం. ఎందుకోసరమో అని నేను నిరీక్షిస్తున్నాను.

'మరేంఅనుకోక యీ యింటోంచి బయటికి యెవరొస్తారో కాస్త పరీక్షించు, నేనిపుడే అయిదు నిమిషాల్లోవస్తా.'

అంటూ ప్రక్కసందులోనికి మాయమయినాడు. కొద్దికొద్దిగా వెలుగొస్తోంది. నాకు యేమీ అర్థంకావడంలేదు. అరగంటగడిచింది. విసుగొచ్చి వెళ్ళిపోదామనుకుంటున్నాను. ఇంతలో ఆ యింటి తలుపు తెరవబడింది. నాకు విచిత్రమైంది. మా నారాయణరావు గూడకట్టుతో బయటికివచ్చాడు. ఒకఅమ్మాయి వచ్చి తలుపువేసుకుంది. నేను నారాయణరావుకు యెదురుగా వెళ్ళి చెయ్యిపట్టుకున్నాను. వాడు ఆ పరిస్థితుల్లో నన్నక్కడ చూసి నిర్ఘాంతపోయ్యాడు.

'ఏంబ్రదర్ ! ఏఁవిటీవ్యామోహం ? ఇన్నాళ్లనించీ రాధను నిందిస్తూ నువ్వుచేస్తున్న పనేమిటీ ?'

నాకు సమాధానంరాలేదు. విసుగ్గా వెళ్ళిపొయ్యాను. వాళ్ల అమాయకత్వానికి జాలీ కోపము కూడా కలిగినై. నేను నెమ్మదిగా యింటికి దారితీశా.


మదనకామేశ్వర లేహ్యము




బలవర్ధకమయినది. మేహము నిక్కాక, నిస్సత్తువ, శుక్లనష్టము, అతిమూత్రము, మొదలగు వాటిని హరించి, మిక్కిలి బలమును, వీర్య వృద్ధిని, భోగశక్తిని కలిగించుటలో అప్రతిహతమయినది.

2 డబ్బీలు చాలును.

20 తులముల డబ్బీ రు. 2-0-0

రోజాపుష్ప లేహ్యము

మధురమయినది. మలబద్ధకమును ఖండించుటలో అమోఘమైనది. అజీర్ణము, గర్భవాయువు, మూలవ్యాధి, మొదలగు వాటిని హరించి కొలవిరేచనము చక్కగా కలిగించును.

15 తు॥ డబ్బీ రు. 1-0-0 వి. పి. చార్జి ప్రత్యేకము.

అన్ని ఔషధముల క్యాట్లాగు ఉచితం.

పి. సి. ఎ. అండు కంపెనీ,

ఆయుర్వేదసమాజం-పెరిదేపి, నెల్లూరుజిల్లా.